సాక్షి నిజామాబాద్


మంగళవారం । 25 । మార్చి । 2025



ఫిర్యాదులకు సత్వర..

ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు.

- 8లో ▸



గరిష్టం/కనిష్టం
38.7 /20.7

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశాలున్నాయి. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

త్వరితగతిన వ్యవసాయ కనెక్షన్లు

● ఎస్‌ఈ రవీందర్

నిజామాబాద్ సిటీ: రైతులు దరఖాస్తు చేసిన వెంటనే వ్యవసాయ సర్వీస్ కనెక్షన్‌లు మంజూరు చేస్తామని విద్యుత్‌శాఖ ఎస్‌ఈ రవీందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 1,86,571 కనెక్షన్లు ఉండగా, 2024–25 సంవత్సరానికిగాను 3,597 కనెక్షన్లు ఇచ్చినట్లు వెల్లడించారు. కొత్త సర్వీసులకు అవసరమైన స్తంభాలు, కండక్టర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఏప్రిల్, మే నెలల్లో మంజూరు వేగవంతం కానున్నదని, కనెక్షన్‌ల కోసం రైతులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తు విధానంతో పనులు జాప్యం లేకుండా జరుగుతాయని పేర్కొన్నారు.

155 రకాల వంగడాల ప్రదర్శన



డొంకేశ్వర్(ఆర్మూర్): మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఉజ్జయిని నగరంలో ఇండియా ఫార్మర్స్ 68వ కౌన్సిల్ సమావేశం సోమవారం నిర్వహించారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన వెయ్యి మంది రైతులు సమావేశానికి హాజరుకాగా, రాష్ట్రం నుంచి ఐదుగురు పాల్గొన్నారు. వారిలో జక్రాన్‌పల్లి మండలం చింతలూరుకు చెందిన ఆదర్శరైతు నాగుల చిన్నగంగారాం (చిన్ని కృష్ణుడు) ఉన్నారు. తను సొంతగా అభివృద్ధి చేసిన 155 రకాల దేశీ వరి వంగడాలను చిన్నకృష్ణుడు ప్రదర్శనకు ఉంచారు. సమావేశానికి హాజరైన వివిధ రాష్ట్రాల రైతులు వరి విత్తనాలను ఆసక్తిగా తిలకించారు. అనంతరం చిన్నికృష్ణుడు ప్రకృతి వ్యవసాయంపై సమావేశంలో ప్రసంగించారు.

కొనసాగుతున్న పది పరీక్షలు


నిజామాబాద్ అర్బన్: జిల్లాలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. సోమవారం ఇంగ్లిష్ పరీక్ష నిర్వహించగా, 22,735 మంది విద్యార్థులకుగాను 22,679 మంది హాజరయ్యారు. 56 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.



ఈ గేటు.. తెరుచుకోవడం లేటు

ఇందల్వాయి మండల కేంద్రంలోని రైల్వే గేటు తరుచూ మొరాయిస్తోంది. రైళ్ల రాకపోకల అనంతరం గేటు తెరుచుకోకపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు. సోమవారం రెండుసార్లు ఒకే పక్కన గేటు తెరుచుకోవడంతో వాహనదారులు కొంతసేపు అక్కడే నిరీక్షించారు. నూతనంగా ఏర్పాటు చేసిన ఎలక్ట్రిక్ గేటు మొదటి నుంచి మొరాయిస్తోందని, రైల్వే అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

– ఇందల్వాయి



కాంగ్రెస్‌లో గ్రూపుల లొల్లి

కార్పొరేషన్‌ల చైర్మన్‌లకు కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న బాల్కొండ నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకుల మధ్య ఆధిపత్య పోరుసాగుతోంది. అసెంబ్లీ టికెట్ ఆశించిన నాటి నుంచి ఆ ముగ్గురు నాయకుల మధ్య ప్రారంభమైన పంచాయితీ అనేక మలుపులు తిరుగుతోంది. నాయకుల వర్గీయుల మధ్య సోషల్ మీడియాలో కొనసాగుతున్న వార్ పోలీస్‌స్టేషన్‌లకు చేరుతోంది. తాజాగా ఇసుక తోలకాల పంచాయితీ కొనసాగుతుండగా, సదరు నాయకులు ఇప్పటికే అధిష్టానానికి ఒకరిపైఒకరు ఫిర్యాదులు చేశారు.

- బాల్కొండ నాయకుల మధ్య ఆధిపత్య పోరు
- నియోజకవర్గంలో ఎడతెగని పంచాయితీ
- ఎన్నికల ముందు నుంచే మొదలు..
- ఇసుక తోలకాల పంచాయితీతో అనేక మలుపులు
- చివరకు సోషల్ మీడియాలో యుద్ధం చేస్తున్న వైనం



అనిల్ మోహన్‌రెడ్డి సునీల్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: అత్యధిక సంఖ్యలో రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ పదవులు పొందిన బాల్కొండ నియోజకవర్గంలో ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే అధికార కాంగ్రెస్ పార్టీలో మాత్రం పవర్ సెంటర్ల సంఖ్య ఎక్కువగా ఉండడంతో అంతా గందరగోళం అన్నట్లుగా తయారైంది. పార్టీ శ్రేణులు మాత్రం ఇదేం పరిస్థితి వచ్చిందని పరేషాన్ అవుతున్నాయి. పార్టీలో సీనియర్లు, జూనియర్లు అనే కథ ఇప్పటికే నడుస్తుండగా, తాజాగా ఇసుక తోలకాల విషయంలో పార్టీ నాయకుల మధ్యే రగడ నడుస్తోంది. గత ఎన్నికల ముందు మొదలైన గ్రూ పుల పంచాయితీ రానురాను మరింత పెరుగుతోంది తప్ప ఫుల్‌స్టాప్ పడడం లేదు. గ్రూపులకు నాయకత్వం వహిస్తున్న నాయకులు పీసీసీ అధ్యక్షుడికి పరస్పరం ఫిర్యాదులు చేసుకుంటున్నారు. అంతటితో ఆగక గత వారం రోజులుగా సోషల్ మీడియా వేదికగా ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకుంటున్నారు. నాయకుల వర్గీయుల మధ్య వాట్సాప్ గ్రూపుల్లో హోరాహోరీ వార్ నడుస్తోంది. దీంతో ఈ సోషల్ యుద్ధం వ్యవహారం పోలీసు స్టేషన్‌లకు చేరుతోంది. నియోజకవర్గంలో ఇసుక తోలకాల విషయంలో సునీల్‌రెడ్డి వర్సెస్ మానాల, ఈరవత్రి గ్రూపుల మధ్య ఎడతెగని వార్ నడుస్తోంది. లోక్‌సభ, ఎమ్మెల్సీ ఎన్నికల్లో సైతం సునీల్ వర్గీయులు తమను రాకుండా చేసినట్లు ఈరవత్రి, మానాల వర్గీయులు చెబుతున్నారు. నియోజకవర్గ ప్రజలు మాత్రం ఈ చోద్యాన్ని చూస్తూ అసహనం వ్యక్తం చేస్తున్నారు.

అసెంబ్లీ టికెట్ నుంచి..

గత శాసనసభ ఎన్నికల్లో ఈరవత్రి అనిల్, మానాల మోహన్‌రెడ్డి టిక్కెట్ ఆశించారు. అయితే కొన్నిరోజుల ముందే కాంగ్రెస్‌లో చేరిన ముత్యాల సునీల్‌రెడ్డి అనూహ్యంగా టిక్కెట్ దక్కించుకున్నారు. ఎన్నికల బరిలో నిలిచి ఓటమిపాలయ్యారు. మానాల, ఈరవత్రిల సహకారం లేకపోవడంతోనే ఓడిపోయామని సునీల్ వర్గం ఆరోపిస్తుండగా, సునీల్‌రెడ్డి తమను పట్టించుకోలేదని, ఓటమికి తమను బాధ్యులను చేయడం సరికాదని మానాల, ఈరవత్రి ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో డీసీసీ అధ్యక్షుడిగా ఉన్న మానాల మోహన్‌రెడ్డి రాష్ట్ర కో ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్‌గా, ఈరవత్రి అనిల్ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా, అన్వేష్‌రెడ్డి రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా పదవులు దక్కించుకున్నారు. మధ్యలో బీఆర్‌ఎస్ నుంచి వచ్చిన రమేశ్‌రెడ్డి డీసీసీబీ చైర్మన్ అయ్యారు.

లబ్ధిదారుల ఎంపికపై ప్రభావం..

ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల లబ్ధిదారుల ఎంపికపై నాయకుల మధ్య ఆధిపత్య పోరు ప్రభావం చూపుతుందని పార్టీ కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు సైతం గందరగోళానికి గురవుతారని అంటున్నారు.

పంట నష్టపరిహారం చెల్లించాలి



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు ధన్‌పాల్, భూపతిరెడ్డి

- పసుపు, ఎర్రజొన్న రైతులపై కేసులు ఎత్తివేయాలి
- వ్యవసాయ కళాశాల ఏర్పాటు చేయాలి
- అసెంబ్లీలో రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): అకాల వర్షాలు, వడగళ్ల వానలకు సుమారు వేయి ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లిందని, బాధిత రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో సోమవారం ఆయన మాట్లాడారు. దెబ్బతిన్న పంటలకు సంబంధించి ఎకరానికి రూ.10వేలు చొప్పున పరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని కోరగా.. సానుకూలంగా స్పందించిన సీఎం, మంత్రికి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. అలాగే నిజామాబాద్ జిల్లా పసుపు, ఎర్రజొన్నల రైతులపై, మంచిప్ప ప్రాజెక్టు ముంపు గ్రామాల బాధితులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని కోరారు. గతంలో జిల్లాకు వచ్చిన సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి సైతం కేసులు ఎత్తివేస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని ఎమ్మెల్యే గుర్తు చేశారు. రూరల్ నియోజకవర్గంలో 400 ఎకరాల భూమి అందుబాటులో ఉన్నందున జిల్లాకు నూతనంగా వ్యవసాయ యూనివర్సిటీ లేదా వ్యవసాయ కళాశాల మంజూరు చేయాలని భూపతిరెడ్డి కోరారు.

బెట్టింగ్ యాప్‌ల ఓనర్లపై చర్యలు తీసుకోవాలి

నిజామాబాద్ సిటీ: బెట్టింగ్‌యాప్‌ల యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ప్రభుత్వాన్ని కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో సోమవారం ఆయన మాట్లాడారు. అనేక మంది మధ్యతరగతి యువత తమకు తెలియకుండానే బెట్టింగ్ ఊబిలోపడి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. యాప్స్‌లో పెద్ద మొత్తంలో డబ్బులు కోల్పోయి ఆర్థికంగా, మానసికంగా కృంగిపోతున్న యువకులు చివరకు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. బెట్టింగ్‌యాప్స్ ప్రమోటింగ్‌లో మాజీ మంత్రి ప్రమేయం ఉందన్న ఆరోపణలపై విచారణ జరపాలన్నారు. కొందరు ప్రమోటర్లకు నోటీసులిచ్చి కేసులు బుక్‌చేస్తే సరిపోదని, డ్రగ్స్ కేసును నీరుగార్చినట్లు కాకుండా పూర్తిస్థాయి విచారణ జరిపి దోషులను శిక్షించాలని కోరారు. ఆస్తి పన్ను వడ్డీ మాఫీపై వెసులుబాటు కల్పించాలన్నారు.

కనుల పండువగా దోపోత్సవం



మోపాల్: నర్సింగ్‌పల్లిలోని ఇందూరు తిరుమల బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఐదో రోజైన సోమవారం దోపోత్సవం నిర్వహించారు. అశ్వవాహనంపై స్వామివారిని మాడవీధుల్లో ఊరేగించారు. అశ్వవాహనంపై శ్రీవారు సిరి సంపదల ను తీసుకొని వస్తారని దేవనాథ జీయర్ స్వామి, గంగోత్రి రామానుజ స్వామి ప్రవచించారు. ధర్మకర్తలు దిల్ రాజు, నర్సింహారెడ్డి, శిరీశ్, విజయసింహారెడ్డి, మాజీ సర్పంచ్ సాయారెడ్డి, మాజీ ఎంపీటీసీ రాములు, నరాల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

క్షయరహిత జిల్లాగా మారుద్దాం



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న అడిషనల్ కలెక్టర్ కిరణ్‌కుమార్

- వైద్య సిబ్బంది అంకితభావంతో పని చేయాలి
- అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్
- జిల్లా కేంద్రంలో అవగాహన ర్యాలీ

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్‌ను క్షయరహిత జిల్లాగా మార్చేందుకు కలిసికట్టుగా కృషిచేయాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినాన్ని పురస్కరించుకుని సోమవారం నిర్వహించిన ర్యాలీని జీజీహెచ్ ఆవరణలో అదనపు కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. బస్టాండ్ మీదుగా న్యూ అంబేడ్కర్ భవన్‌కు ర్యాలీ చేరుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. వైద్య సిబ్బంది అంకితభావంతో పనిచేసి క్షయను నివారించాలన్నారు. వ్యాధి నిర్ధారణ పరీక్షలు, చికిత్స, నివారణ చర్యలు సకాలంలో చేపట్టి కొత్తగా క్షయ వ్యాధిగ్రస్తులు నమోదు కాకుండా చూడాలన్నారు. డీఎంహెచ్‌వో రాజశ్రీ మాట్లాడుతూ.. క్షయ నివారణపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే వ్యాధి నిర్మూలన సాధ్యమని పేర్కొన్నారు. టీబీ రోగులు పూర్తికాలం చికిత్స తీసుకోవాలని సూచించారు. చికిత్స తీసుకున్నంత కాలం పౌష్టకాహారం కోసం రోగి ఖాతాలో ప్రతి నెలా వెయ్యి రూపాయలు జమ చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా టీబీ నివారణ అధికారి డాక్టర్ దేవీనాగేశ్వరి, డీఐవో అశోక్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ డివిజన్ చైర్మన్, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ శ్రీశైలం, పల్మనాలజీ డిపార్ట్‌మెంట్ డాక్టర్ ఉమర్, టీబీ మెడికల్ ఆఫీసర్ అవంతి, రాజేందర్, జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ ఘనపూర్ వెంకటేశ్వర్లు, టీబీ కోఆర్డినేటర్ రవి, ఆకాశవాణి కో ఆర్డినేటర్ మోహన్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

లెదర్‌పార్క్‌కు మోక్షమెన్నడో?

- దశాబ్దాలుగా చర్మకారుల ఎదురుచూపులు
- గతంలోనే మాస్టర్ ట్రైనర్లుగా శిక్షణ పొందిన 60 మంది..
- తుది దశకు అడ్మినిస్ట్రేషన్ భవన నిర్మాణ పనులు



ఆర్మూర్ పట్టణంలో వృథాగా ఉన్న లెదర్ పార్క్ (లిడ్‌క్యాప్) భవనం



నూతనంగా నిర్మిస్తున్న లెదర్ పార్క్ అడ్మినిస్ట్రేషన్ భవనం

ఆర్మూర్: దశాబ్దాలు గడుస్తున్నా.. ప్రభుత్వాలు మారినా ఆర్మూర్ లెదర్ పార్క్‌కు మోక్షం కలగడం లేదు. చర్మకారులు, చేతివృత్తులను నమ్ముకొని జీవిస్తున్న వారికి ఏళ్లుగా నిరాశే ఎదురవుతోంది. మరో వైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా మంజూరు చేసిన నిధులతో మౌలిక సదుపాయాల కల్పనతోపాటు అడ్మినిస్ట్రేషన్ భవన నిర్మాణం పనులు చివరి దశకు చేరుకున్నాయి. రూ.10 కోట్లతో చేపడుతున్న ప్రస్తుత నిర్మాణ పనులు పూర్తయిన తర్వాతైనా చర్మకారుల బతుకుల్లో వెలుగులు వచ్చేనా అనే చర్చ మొదలైంది.

తుది దశకు మరో భవన నిర్మాణం..

ఆర్మూర్ పట్టణ శివారులో చర్మ పరిశ్రమ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం 2017లో రూ.10 కోట్లు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారుల పర్యటన అనంతరం 80 శాతం కేంద్రం నిధులు, 20 శాతం రాష్ట్రం నిధులతో ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఒప్పందం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం జీఐవో గ్రాంట్ రూ.2 కోట్ల 60 లక్షలను 2019లో డిపాజిట్ చేసింది. దీంతో కేంద్ర ప్రభుత్వం తన వాటా ధనాన్ని కలిపి 2022లో రూ.10 కోట్లను మంజూరు చేసింది. ఈ నిధులతో చర్మ పరిశ్రమలో మౌలిక సదుపాయాల కల్పన పనులు ఏడాది క్రితం ప్రారంభమయ్యాయి. రూ.కోటీ 80 లక్షలతో అడ్మినిస్ట్రేషన్ భవనం నిర్మాణం పూర్తి కావొస్తుండగా, తమ జీవితాలు మలుపు తిరగనున్నాయని చర్మకారులు భావిస్తున్నారు.

2003లో శంకుస్థాపన

ఉమ్మడి రాష్ట్రంలో ఆర్మూర్ ప్రాంత చర్మ కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో లిడ్‌క్యాప్(చర్మ పరిశ్రమ)నకు 2003 ఆగస్టు 20న అప్పటి మంత్రి మండవ వెంకటేశ్వరరావు శంకుస్థాపన చేశారు. జిరాయత్‌నగర్‌లోని యానంగుట్ట వద్ద 28 ఎకరాల స్థలాన్ని అప్పటి ప్రభుత్వం కేటాయించి రూ.10 లక్షలు మంజూరు చేయగా, చెప్పులు తయారు చేసే భవన నిర్మాణం పూర్తి చేసి చేతులు దులుపుకున్నారు. 60 మంది చర్మకారులను మాస్టర్ ట్రైనర్లుగా గుర్తించి వారిని చెన్నైకి పంపించి ఆరు నెలలపాటు శిక్షణ ఇప్పించారు. ప్రస్తు తం వీరంతా ఉపాధి లేక ఆర్మూర్, పెర్కిట్, మామిడిపల్లి రోడ్లపై పాత చెప్పులకు మరమ్మతులు చేస్తున్నారు.

మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో చర్మ పరిశ్రమలో మౌలిక సదుపాయాల కల్పన పనులు కొనసాగుతున్నాయి. చర్మకారులు ఇక్కడ ఉపాధి కల్పించుకోవడానికి పూర్తి అవకాశాలను కల్పిస్తాం. కేటాయించిన స్థలంలో 120 ప్లాట్లు చేసి అర్హత మేరకు చర్మకారులకు ఇస్తాం. – ప్రవీణ్ కుమార్, జనరల్ మేనేజర్, మైక్రో అండ్ స్మాల్ ఎంప్లాయీస్ డిపార్ట్‌మెంట్

ఇక కేస్ క్లోజ్!

- మూడు నెలల క్రితం సంచలనం రేపిన మూడు మరణాలు
- మృతుల్లో ఎస్సై, కానిస్టేబుల్‌తో సహా మరో వ్యక్తి
- నీళ్లు మింగి చనిపోయినట్లు తేల్చిన ఫోరెన్సిక్ నివేదిక
- ఆధారాలు లేని కేసుగా పరిగణిస్తున్న పోలీసులు



సాయికుమార్, ఎస్సై (ఫైల్) శ్రుతి, కానిస్టేబుల్ (ఫైల్) నిఖిల్ (ఫైల్)

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లా కేంద్రానికి సమీపంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి పెద్ద చెరువులో గతేడాది డిసెంబర్ 25న ముగ్గురి మృతదేహాలు లభించిన విషయం తెలిసిందే. మృతులను భిక్కనూరు ఎస్సైగా పనిచేసిన సాయికుమార్, బీబీపేట పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేసిన శ్రుతి, బీబీపేట గ్రామానికి చెందిన నిఖిల్ అనే యువకుడిగా గుర్తించారు. మృతుల్లో ఎస్సై, కానిస్టేబుల్ ఉండడంతో పోలీస్ ఉన్నతాధికారులు అన్ని కోణాల్లో పరిశీలించారు. కేసును త్వరితగతిన తేల్చాలని భావించినా సరైన ఆధారాలు దొరక్కపోవడంతో సాంకేతిక అంశాలపై ఆధారపడాల్సి వచ్చింది. సంఘటన జరిగిన ప్రాంతంలో ఎక్కడా సీసీ కెమెరాలు లేకపోవడంతో ఎటూ తేల్చలేకపోయారు. మృతుల వాట్సాప్ చాటింగ్, వాళ్ల మధ్య జరిగిన సంభాషణలకు సంబంధించిన కాల్‌డేటా మాత్రమే కేసులో కొంతమేర పరిశోధనకు ఉపయోగపడినట్లు తెలుస్తోంది.

సాక్షులు, బాధితులు, నిందితులు లేని కేసు..

హత్య, ఆత్మహత్య ఏదైనా సరే కేసులో ఎవరో ఒకరు బాధితులు ఉంటారు. సాక్ష్యాలు కూడా దొరుకుతాయి. అందుబాటులోకి వచ్చిన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి కేసుల్లో నిందితులను గుర్తించి పట్టుకోగలుగుతున్నారు. అయితే ఈ కేసులో ముగ్గురి మధ్య జరిగిన వ్యవహారం కావడం, ముగ్గురికి ముగ్గురూ ఏకకాలంలో చనిపోవడంతో కేసులో బాధితులు, నేరస్తు లు, సాక్షులు ఎవరూ లేకుండా పోయారు. చెరువు వద్దకు ఎందుకు వెళ్లారు? అక్కడ ఏమైనా గొడవ పడ్డారా? ఎవరు ముందు దూకి ఉంటారు? ఒకరిని కాపాడేందుకు ఒకరి వెంట మరొకరు దూ కారా? ఇద్దరు దూకడంతో తమపైకి వస్తుందని మూడో వ్యక్తి కూడా దూకి ఉంటారా? ఇలా ఎన్నో అనుమానాలు వ్యక్తమైనా వాటికి సంబంధించి ఎలాంటి సాక్ష్యాలు, ఆధారాలు దొరకలేదు. కాగా ఫోరెన్సిక్ నివేదికల్లో నీళ్లు మింగడం ద్వారానే మరణం సంభవించినట్లుగా వెల్లడైంది. దీంతో ముగ్గురు నీళ్ల లో మునిగిపోవడం వల్లే చనిపోయినట్లు స్పష్టమవుతోంది.

అన్ని కోణాల్లో దర్యాప్తు..

ముగ్గురి మరణానికి సంబంధించిన ఈ కేసులో అన్ని కోణాల్లో దర్యాప్తు జరిపిన పోలీసులు వాళ్ల చావులకు మరెవరూ కారణం కాదని, వాళ్లకు వాళ్లుగానే చనిపోయినట్టు నిర్ధారణకు వచ్చారు. ఇప్పటికే మూడు నెలలు గడిచింది. కేసు వివరాల నివేదికను రూపొందించి కోర్టుకు, అలాగే మృతుల బంధువులకు అప్పగించి కేసును క్లోజ్ చేయడమే మిగిలిందని పోలీసు వర్గాల ద్వారా తెలుస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగించిన ఈ కేసును త్వరలోనే క్లోజ్ చేసే అవకాశాలున్నాయి.

బాన్సువాడ గడ్డ.. బీఆర్‌ఎస్ అడ్డా

- ప్రస్తుత ప్రభుత్వం రంజాన్ తోఫా ఇవ్వడం లేదు
- ఇఫ్తార్ విందులో ఎమ్మెల్సీ కవిత



బాన్సువాడలో ఇఫ్తార్ విందులో ప్రార్థన చేస్తున్న ఎమ్మెల్సీ కవిత

బాన్సువాడ: బాన్సువాడ గడ్డ బీఆర్‌ఎస్ అడ్డా అని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. సోమవారం బాన్సువాడ పెద్ద మజీద్ వద్ద నిర్వహించిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో ముస్లింల కోసం షాదీముబారక్ పథకం ప్రవేశపెట్టామన్నారు. రంజాన్ పండుగను అధికారికంగా నిర్వహించి పేద ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ చేశామని గుర్తు చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రంజాన్ తోఫా ఇవ్వడం లేదని విమర్శించారు. విదేశాల్లో చదివే విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వ సలహాదారుగా ఉన్న పోచారం శ్రీనివాస్ రెడ్డి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. నాయకులు వస్తారు.. పోతారని, కానీ కార్యకర్తలు మాత్రం ఎప్పటికీ ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, బీఆర్‌ఎస్ నాయకులు ఆయేషాబేగం, సుమిత్ర, జుబేర్, కిషన్, మోచీ గణేష్, గౌస్, సాయిబాబా, సాయిలు, శివ, రమేశ్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌అర్బన్‌: నిజామాబాద్‌ నగర శివారులోని నాగారం గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఇంగ్లిష్‌ బోధించేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్‌ సైదా జైనబ్‌ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ, పీహెచ్‌డీ, నెట్‌ లేదా సెట్‌ ఉత్తీర్ణులైన మహిళా అభ్యర్థులు ఈ నెల 27 వరకు గురుకులంలో దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు. ఇది పూర్తి తాత్కాలిక పద్ధతిలో జరిగే నియామకమని, 28న డెమో ఆధారంగా ఎంపిక ఉంటుందని తెలిపారు. పీహెచ్‌డీ పూర్తి చేసిన వారికి ప్రాధాన్యతనిస్తున్నట్లు పేర్కొన్నారు.

హెడ్‌ కుక్‌, అసిస్టెంట్‌ కుక్‌ పోస్టులకు..

బాల్కొండ: మండల కేంద్రంలోని టీఎస్‌ఎంఎస్‌ బాలికల హాస్టల్‌లో హెడ్‌ కుక్‌, అసిస్టెంట్‌ కుక్‌ల పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌ భవాని ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 27లోపు హాస్టల్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. హెడ్‌ కుక్‌కు కనీస విద్యార్హత ఎస్సెస్సీ, అసిస్టెంట్‌ కుక్‌కు ఏడవ తరగతి అర్హత కలిగి ఉండాలన్నారు. స్థానికులైన 35ఏళ్ల లోపు వయసున్న మహిళలు మాత్రమే అర్హులన్నారు. మరిన్ని వివరాల కోసం 95734 81375ను సంప్రదించాలన్నారు.

ముందుకొస్తున్న ఆపన్నహస్తాలు



డొంకేశ్వర్‌(ఆర్మూర్‌): లుకేమియా (బ్లడ్‌ క్యాన్సర్‌)తో బాధపడుతున్న డొంకేశ్వర్‌ మండలం గంగాసముందర్‌ గ్రామానికి చెందిన నిర్విన్‌ తేజ్‌ ప్రాణాలను కాపాడేందుకు ఆపన్న హస్తాలు ముందుకొస్తున్నాయి. తొండాకూర్‌ గ్రామానికి చెందిన షేక్‌ సలీం బాలుడి వైద్య ఖర్చుల కోసం రూ.30వేల చెక్కును సోమవారం అందజేశారు. గంగాసముందర్‌ గ్రామానికి చెందిన యువత సైతం ముందుకొచ్చి తోచిన ఆర్థిక సాయాన్ని అందజేశారు. నిర్విన్‌ తేజ్‌ చదువుతున్న తొండాకూర్‌ ఎస్‌ఎస్‌వీ పాఠశాల యాజమాన్యం సైతం విరాళాలు సేకరిస్తోంది. నిర్విన్‌ తేజ్‌ ఆరోగ్య పరిస్థితిని వివరిస్తూ 'సాక్షి'లో 'పాపం బాలుడిని ఆదుకోరూ' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించి చాలా మంది తమ వాట్సాప్‌ స్టేటస్‌గా పెట్టుకున్నారు.

సీపీని కలిసిన ఉర్దూ అకాడమీ చైర్మన్‌



ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ పోలీస్‌ కమిషనర్‌ పోతరాజు సాయిచైతన్యను సోమవారం రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్‌ తాహెర్‌బిన్‌ హందాన్‌ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన వెంట కాంగ్రెస్‌ నాయకులు ఉన్నారు.

31లోపు పరీక్ష ఫీజు చెల్లించండి

నిజామాబాద్‌అర్బన్‌: గిరిరాజ్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2వ, 4వ, 6వ డిగ్రీ రెగ్యులర్‌ సెమిస్టర్‌ పరీక్షలకు, 1 నుంచి 6వ సెమిస్టర్‌ బ్యాక్‌లాగ్‌ పరీక్షలకు ఈనెల 31లోపు పరీక్ష ఫీజు చెల్లించాలని ప్రిన్సిపాల్‌ రామ్మోహన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. రూ.100తో అపరాధ రుసుంతో ఏప్రిల్‌ 4లోపు, రూ.500 అపరాధ రుసుంతో ఏప్రిల్‌ 6లోపు చెల్లించడానికి అవకాశం ఉందన్నారు. రూ.1000 అపరాధ రుసుంతో ఏప్రిల్‌ 7వరకు ఫీజు చెల్లించవచ్చునన్నారు. పరీక్ష ఫీజును ఆన్‌లైన్‌లో మాత్రమే చెల్లించాలన్నారు.

విద్యతోపాటు క్రీడలకు ప్రోత్సాహం



తెయూ(డిచ్‌పల్లి): రాష్ట్ర ప్రభుత్వం విద్యతోపాటు క్రీడలకు సమ ప్రాధాన్యతను ఇస్తుందని తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌ యాదగిరి అన్నారు. తెయూలో సోమవారం తెలంగాణ యూనివర్సిటీ యాన్యువల్‌ డే–2025 స్పోర్ట్స్‌ మీట్‌లో భాగంగా బాలుర కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా రిజిస్ట్రార్‌ మాట్లాడుతూ.. తెలంగాణ యూనివర్సిటీలో విద్యతోపాటు క్రీడలను, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్నామని, వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తెయూ స్పోర్ట్స్‌ డైరెక్టర్‌ బాలకిషన్‌, పీఆర్‌వో పున్నయ్య, ఆర్గనైజింగ్‌ సెక్రటరీ బీఆర్‌ నేత తదితరులు పాల్గొన్నారు. కబడ్డీ తొలి పోరులో ఎంఎస్సీ కెమిస్ట్రీ జట్టు–అప్లయిడ్‌ ఎకనామిక్స్‌ జట్టు తలపడగా అప్లయిడ్‌ ఎకనామిక్స్‌ జట్టు విజయం సాధించింది. రెండవ పోరులో అప్లయిడ్‌ ఎకనామిక్స్‌ జట్టు, మాస్‌ కమ్యూనికేషన్‌ జట్టు తలపడగా మాస్‌ కమ్యూనికేషన్‌ జట్టు విజయం సాధించింది.



ఫిర్యాదులకు సత్వర పరిష్కారం చూపాలి

- కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు
- ప్రజావాణిలో దరఖాస్తుల స్వీకరణ

నిజామాబాద్‌అర్బన్‌: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. నగరంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు, అదనపు కలెక్టర్లు అంకిత్‌, కిరణ్‌కుమార్‌, జెడ్పీ సీఈవో సాయాగౌడ్‌, డీపీవో శ్రీనివాస్‌, నిజామాబాద్‌ ఆర్డీవో రాజేంద్రకుమార్‌, మెప్మా పీడీ రాజేందర్‌లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. మొత్తం 82 ఫిర్యాదులు రాగా, అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్‌ అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు, అధికారులు



నా భూమి నాకు ఇప్పించండి..



నా భూమిని ఇతరులు పట్టా మార్పిడి చేసుకున్నారు. నలభై ఏళ్ల కిందట నా తండ్రి ఎల్లాగౌడ్‌ నా పేరు మీద కమ్మర్‌పల్లి మండలం నాగపూర్‌ గ్రామంలోని సర్వే నంబర్‌ 1252ను కొనుగోలు చేశారు. దుంపల గంగు నా భూమిని అక్రమంగా మార్పిడి చేయించుకున్నారు. భూమికి సంబంధించిన పత్రాలు నా వద్దే ఉన్నాయి. వెంటనే నా భూమిని నాకు ఇప్పించండి.

–కృష్ణాగౌడ్‌, కమ్మర్‌పల్లి

అక్రమ నిర్మాణాన్ని తొలగించాలి

సిరికొండ మండలం నర్సింగ్‌పల్లి గ్రామంలో నాకు సొంత భూమి ఉంది. నా స్థలంలో మిట్టపల్లి కవిత అక్రమంగా నిర్మాణం చేపడుతుంది. అధికారులు స్పందించి వెంటనే నా స్థలంలో అక్రమ నిర్మాణాన్ని తొలగించాలి. నా భూమిని కాజేయాలని ఉద్దేశంతో మాపై తప్పుడు కేసులు వేయడంతోపాటు బెదిరింపులకు గురిచేస్తున్నారు.

– రజిత, నర్సింగ్‌పల్లి

వితంతు పెన్షన్‌ వస్తలేదు..

నేను నాలుగేళ్లుగా వితంతు పింఛన్‌ కోసం కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాను. అధికారులు మంజూరు చేయడం లేదు. పింఛన్‌ మంజూరు చేస్తే నా కుటుంబానికి జీవనాధారం దొరుకుతుంది. ఇదివరకే మున్సిపల్‌ కార్పొరేషన్‌లో కూడా దరఖాస్తు చేశాను. అధికారులు స్పందించి నాకు పింఛన్‌ అందించి, కుటుంబాన్ని ఆదుకోవాలి.

– గౌసియా బేగం, సతీష్‌నగర్‌

న్యాయం చేయండి



నా భర్త నిజామాబాద్‌లోని నాగారం ప్రాంతానికి చెందిన మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. కొన్ని రోజుల నుంచి అదనపు కట్నం కోసం నన్ను వేధిస్తున్నాడు. దాస్‌నగర్‌లోని నా ఇంటిని అదే గ్రామానికి చెందిన వెంకట్రావు కూల్చివేశాడు. నా భర్త రూ.5000 తీసుకున్నాడని అందుకే ఇంటిని కూల్చివేస్తున్నట్లు పేర్కొన్నాడు. ఎలాగైనా నాకు న్యాయం చేయండి.

– రేణుక, దాస్‌నగర్‌

పట్టించుకోవడం లేదు



నాకు అనారోగ్య సమస్యల కారణంగా రోజువారి జీవితం గగనంగా మారింది. సరైన ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నా. పింఛన్‌ కోసం అధికారులకు ఇప్పటికే విన్నవించాను. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నాకు పెన్షన్‌ ఇప్పిస్తే, ఎంతో ఆసరాగా ఉంటుంది.

– గంగాధర్‌, బోధన్‌

పింఛన్‌ ఇప్పించండి



నాకు పక్షవాతం వచ్చి, మూడు సంవత్సరాలు గడుస్తుంది. నాకు వికలాంగుల పింఛన్‌ ఇప్పించాలి. ఇదివరకే మున్సిపల్‌ కార్పొరేషన్‌లో దరఖాస్తు చేసుకున్నాను. పెన్షన్‌ రావడం లేదు. ఎలాగైనా అధికారులు పింఛన్‌ ఇప్పించి నా కుటుంబాన్ని ఆదుకోవాలి.

– అశోక్‌, గాయత్రి నగర్‌

సర్వే పూర్తి చేయించాలి..

రెంజల్‌ మండలం దూపల్లి గ్రామంలో మిస్సింగ్‌ సర్వే గురించి మీ సేవలో దరఖాస్తు చేసుకున్నాను. అయినా ఇప్పటివరకు అధికారులు సర్వే పూర్తిచేయడం లేదు. నాకు అనారోగ్యం ఉంది. ఇప్పటికైనా స్పందించి అధికారులు త్వరగా సుర్వే పూర్తి చేయించేలా చర్యలు తీసుకోవాలి.

– గంగవ్వ, దూపల్లి

మరో సత్యాగ్రహ పోరాటానికి సిద్ధం కావాలి

- ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌
- పలు మండలాల్లో జై బాపు, జై భీం, జై సంవిధాన్‌ సమావేశాల నిర్వహణ



ఏర్గట్లలో ప్రతిజ్ఞ చేస్తున్న కాంగ్రెస్‌ నాయకులు

మోర్తాడ్‌/కమ్మర్‌పల్లి/డిచ్‌పల్లి: రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి ప్రజలు మరో సత్యాగ్రహ పోరాటానికి సిద్ధం కావాలని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌ అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణే ధ్యేయంగా కాంగ్రెస్‌ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. జై బాపు, జై భీం, జై సంవిధాన్‌ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఏర్గట్ల, భీమ్‌గల్‌, కమ్మర్‌పల్లి, డిచ్‌పల్లి మండల కేంద్రాల్లో నిర్వహించిన సమావేశాల్లో బల్మూరి వెంకట్‌ పాల్గొని మాట్లాడారు.

గత పదేళ్లుగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందని ధ్వజమెత్తారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌, జాతిపిత మహాత్మాగాంధీపై బీజేపీ నాయకులు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌ గాంధీ జై బాపు, జై భీమ్‌, జై సంవిధాన్‌ కార్యక్రమాన్ని నిర్వహించాలని పిలుపునివ్వడంతో ప్రజలు ఉమ్మడిగా మరో సత్యాగ్రహాన్ని చేయాలన్నారు. ఈమేరకు ఈనెల 27నుంచి గ్రామాల్లో పాదయాత్ర చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. మైనింగ్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ ఈరవత్రి అనిల్‌, డీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర సహకార సంఘాల అసోసియేషన్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ మానాల మోహన్‌రెడ్డి, బాల్కొండ కాంగ్రెస్‌ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కాటిపల్లి నగేష్‌రెడ్డి, నాయకులు అమృతాపూర్‌ గంగాధర్‌, పాలసాని శ్రీనివాస్‌, కంచెట్టి గంగాధర్‌ తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్‌ ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

నిజామాబాద్‌ అర్బన్‌: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్‌ యూనియన్‌ నాయకులు డిమాండ్‌ చేశారు. ఈమేరకు సోమవారం యూనియన్‌ ఆధ్వర్యంలో జీపీ కార్మికులు నిజామాబాద్‌ కలెక్టరేట్‌ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతుకు వారు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా యూనియన్‌ జిల్లా సహాయ కార్యదర్శి రమేష్‌, నాయకులు మురళి మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 12,750 గ్రామపంచాయతీలలో 60వేల మందికి పైగా కార్మికులు విధులు నిర్వహిస్తున్నారని, ఆరు నెలలుగా వారికి జీతాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికులకు ఈఎస్‌ఐ, పీఎఫ్‌ సౌకర్యంతో పాటు రిటైర్మెంట్‌ బెనిఫిట్‌గా రూ.5లక్షల ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగుల తరహా 30 శాతం పీఆర్సీ అమలు చేయాలని, జీవో నెంబర్‌ 51సవరించి మల్టీ పర్పస్‌ విధానాన్ని రద్దు చేయాలన్నారు. పంచాయతీ కార్మికులకు జీవో నెంబర్‌ 60ప్రకారంగా రూ.16,500 వేతనాన్ని ఇవ్వాలన్నారు. నాయకులు అరవింద్‌, రాజేశ్వర్‌, సత్యమ్మ, కార్మికులు మహేష్‌, రాము, చింటూ, సురేష్‌, బాలు, నరేష్‌, గంగాధర్‌, భోజన్న, నరేష్‌, శ్రీకాంత్‌, రమేష్‌, లింగం, రాజేశ్వర్‌, సాయిలు, దుర్గ, తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకులను వెంటనే రిలీవ్‌ చేయాలి

నిజామాబాద్‌అర్బన్‌: ఇంటర్‌ మూల్యాంకనంలో హాజరయ్యే అధ్యాపకులను ఆయా కళాశాలలు వెంటనే రిలీవ్‌ చేయాలని ఇంటర్‌ విద్యాశాఖ అధికారి తిరుమలపూడి రవికుమార్‌ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26 నుంచి నుంచి ఇంటర్‌ బోటని, జువాలజీ, కామర్స్‌, హిస్టరీ, కెమిస్ట్రీ సబ్జెక్టుల మూల్యాంకనం ప్రారంభమవుతుందన్నారు. మూల్యాంకనం చేసే అధ్యాపకుల ఆర్డర్‌ కాపీలను ఇంటర్‌ బోర్డు ఆయా కళాశాలల లాగిన్లలో నిక్షిప్తం చేసినట్లు తెలిపారు. వెంటనే తమ అపాయింట్మెంట్‌ ఆర్డర్లను డౌన్లోడ్‌ చేసుకొని 26వ తేదీన ఉదయం పది గంటలకు నిజామాబాద్‌ ఖిల్లా బాలుర జూనియర్‌ కళాశాల వద్ద మూల్యాంకన కేంద్రంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. ఆయా కళాశాలలు సంబంధిత అధ్యాపకులను రిలీవ్‌ చేయకుంటే ఇంటర్‌బోర్డు ఆదేశాల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నాట్‌ అపాయింట్‌మెంట్‌ లిస్టులో ఉన్న అధ్యాపకులను కూడా మూల్యాంకనం విధుల్లోకి తీసుకుంటామని తెలిపారు.

క్రైం కార్నర్‌

రేషన్‌ బియ్యం పట్టివేత




ఖలీల్‌వాడి: నగరంలోని వీక్లీ మార్కెట్‌లో సాయికిరణ్‌ అనే వ్యక్తి దుకాణంలో రేషన్‌ బియ్యంను టాస్క్‌ఫోర్స్‌ సిబ్బంది పట్టుకున్నారు. సీపీ సాయి చైతన్య ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్‌ ఇన్‌చార్జి అడిషనల్‌ డీసీపీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వారు దుకాణంపై దాడి చేసి, 20 క్వింటాళ్ల రేషన్‌ బియ్యంను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ. లక్ష ఉంటుందని, తదుపరి చర్య నిమిత్తం వన్‌టౌన్‌ ఎస్‌హెచ్‌వోకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్‌ సీఐ అంజయ్య తెలిపారు. ఎస్సై గోవింద్‌, స్పెషల్‌ పార్టీ సిబ్బంది ఉన్నారు.

వన్నెల్‌(బి)లో మొరం టిప్పర్లు..

బాల్కొండ: మండలంలోని వన్నెల్‌(బి) శివారులో వరద కాలువ నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు టిప్పర్లను సోమవారం బాల్కొండ పోలీసులు పట్టుకున్నారు. టిప్పర్లను, పొక్లెయిన్‌ను బాల్కొండ పోలీస్‌ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేష్‌ తెలిపారు.

కుక్కల దాడిలో 18 గొర్రెలు మృతి



ఎల్లారెడ్డిరూరల్‌: మండలంలోని వెల్లుట్లపేట గ్రామంలో కుక్కల దాడిలో 18 గొర్రెలు మృతి చెందినట్లు గ్రామస్తులు సోమవారం తెలిపారు. గ్రామానికి చెందిన కొర్వి నారాయణ గ్రామ శివారులో గొర్రెలను మేపుతుండగా అకస్మాత్తుగా కుక్కల గుంపు గొర్రెలపై దాడి చేయడంతో మృత్యువాత పడ్డాయని తెలిపారు. మృతి చెందిన 18 గొర్రెల విలువ సుమారు రూ.2లక్షల వరకు ఉంటుందని బాధితుడు తెలిపారు. అధికారులు స్పందించి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

పేకాడుతున్న 8మంది అరెస్టు

బోధన్‌: సాలూర మండల కేంద్రంలో పేకాడుతున్న 8మందిని అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్‌ సిబ్బంది తెలిపారు. సాలూరలోని పంటపొలాల్లో గల పేకాట స్థావరంపై సోమవారం రాత్రి టాస్క్‌ఫోర్స్‌ ఇన్‌చార్జి అడిషనల్‌ డీసీపీ శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్‌ ఇన్‌స్పెక్టర్‌ అంజయ్య, ఎస్సై గోవింద్‌, సిబ్బంది దాడి చేశారు. ఈ దాడిలో పేకాడుతున్న 8మందిని పట్టుకున్నట్లు తెలిపారు. అలాగే వారి వద్ద నుంచి 9 సెల్‌ఫోన్‌లు, సుమారు రూ.లక్ష నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. తదుపరి చర్యల కోసం బోధన్‌ రూరల్‌ ఎస్సైకి అప్పగించినట్లు వెల్లడించారు.

కరెంట్‌ షాక్‌తో రైతు మృతి

- ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యమే కారణమంటున్న గ్రామస్తులు
- సబ్‌స్టేషన్‌లోనే మృతదేహాన్ని ఉంచిన వైనం
- రాంపూర్‌గడ్డ తండాలో ఘటన



స్తంభంపై కరెంట్‌ షాక్‌కు గురైన శ్రీను

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని రాంపూర్‌ గడ్డ తండాలో కరెంటు షాక్‌తో ఓ రైతు మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. వివరాలు ఇలా.. తండాకు చెందిన పిట్ల శ్రీను(30) అనే రైతు సోమవారం సాయంత్రం ట్రాన్స్‌ఫార్మర్‌ వద్ద మరమ్మతుల కోసం పోతంగల్‌ కలాన్‌ సబ్‌స్టేషన్‌ నుంచి ఎల్సీ తీసుకుని పనులు చేపట్టాడు. కానీ ట్రాన్స్‌ఫార్మర్‌ నుంచి అతడు కిందికి రాకముందే అధికారులు కరెంటు సరఫరా చేశారు. దీంతో ట్రాన్స్‌ఫార్మర్‌పై ఉన్న శ్రీను కరెంట్‌ షాక్‌కు గురయ్యాడు. స్థానికులు గమనించి వెంటనే అతడిని 108 అంబులెన్సులో చికిత్స నిమిత్తం బాన్సువాడ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. దీంతో ఆగ్రహించిన గ్రామస్తులు మృతదేహాన్ని పోతంగల్‌ కలాన్‌ స్టేజీ వద్ద ఉంచి ఆందోళన చేశారు. సమాచారం అందుకున్న ఎస్సై ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనను విరమింప జేశారు. మృతదేహాన్ని సమీపంలోని సబ్‌స్టేషన్‌ వద్ద ఉంచారు. సబ్‌స్టేషన్‌ సిబ్బంది నిర్లక్ష్యంతోనే రైతు మృతి చెందాడని, ఉన్నతాధికారులు వచ్చేంత వరకు మృతదేహాన్ని అక్కడే ఉంచుతామని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం



దగ్ధమైన రేకుల ఇల్లు

రుద్రూర్‌: పోతంగల్‌ మండలం కల్లూర్‌ గ్రామంలో ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించి ఇల్లు దగ్ధమైంది. గ్రామస్తులు, బాధితులు తెలిపిన వివరాలు ఇలా. కల్లూర్‌ గ్రామానికి చెందిన బీర్కూర్‌ గంగారాం కుటుంబ సభ్యులు రేకుల ఇంట్లో జీవనాన్ని కొనసాగిస్తున్నారు. సోమవారం ఉదయం వారు ఇంట్లో పూజాకార్యక్రమాలు ముగించుకుని ఇంటికి తాళం వేసి, వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్లిపోయారు. కొద్దిసేపటికి ఇంట్లో నుంచి పొగలు రావడంతో స్థానికులు గమనించి గంగారాంకు సమాచారం అందించారు. వెంటనే బాధిత కుటుంబ సభ్యులు స్థానికుల సహాయంతో మంటలు ఆర్పివేసినప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేకుండాపోయింది. ఇల్లు నిర్మించుకునేందుకు అప్పుగా తెచ్చుకున్న నగదుతోపాటు, బీరువాలోని బంగారం, వెండి ఆభరణాలు, బట్టలు, వంట సామగ్రి, ఫర్నిచర్‌ అగ్నికి ఆహుతయ్యాయి. రెవెన్యూ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని రూ.మూడు లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. పూజ కోసం వెలిగించిన దీపం కింద పడిపోవడంతో మంటలు అంటుకుని ప్రమాదం సంభవించి ఉంటుందని భావిస్తున్నారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

వర్నిలో ఇరువర్గాల మధ్య ఘర్షణ

- 20మందిపై కేసు నమోదు



వర్నిలో ఘర్షణ పడుతున్న ఇరువర్గాలు

వర్ని: మండల కేంద్రంలో ఆదివారం అర్ధరాత్రి కాంగ్రెస్‌ పార్టీ లో రెండు వర్గాలు ఘర్షణ పడినట్లు వర్ని ఎస్సై మహేష్‌ వెల్లడించారు. మండల కేంద్రంలో ఒక టీ పాయింట్‌ వద్ద చిన్నపాటి గొడవ ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకొని ఇరువర్గాలను చెదరగొట్టి ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పారు. ఘర్షణకు పాల్పడ్డ ఇరువర్గాలకు చెందిన 20మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు. అలాగే వర్నిలో పోలీస్‌ పికెటింగ్‌ ఏర్పాటు చేశారు.

18మందిపై కేసు నమోదు

సదాశివనగర్‌(ఎల్లారెడ్డి): మండలంలోని ఉత్తునూర్‌ గ్రామంలో ఇటీవల చోరీకి యత్నించిన దుండగుడిపై గ్రామస్తులు దాడి చేయగా, తీవ్ర గాయాలు కావడంతో మృతిచెందాడు. ఈ ఘటనలో పోలీసులు 18మందిపై కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా.. ఉత్తునూర్‌ గ్రామానికి చెందిన తూర్పు రజనీకాంత్‌(33) బతుకుదెరువు నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లి అక్కడే నివాసం ఉంటున్నాడు. పని నిమిత్తం స్వగ్రామానికి ఈ నెల 18న రాగా, అర్ధరాత్రి స్థానికంగా ఉన్న హనుమాన్‌ మందిరంలో చోరీకి యత్నించాడు. గమనించిన గ్రామస్తులు అతడిని పట్టుకొని దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన రజనీకాంత్‌ను ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు.

మృతుడి తల్లి సత్యబాయి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. సాంకేతికతను ఉపయోగించుకొని 18మంది గ్రామస్తులను పోలీసులు గుర్తించి, వారిపై కేసులు నమోదుచేశారు. సోమవారం వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. దీంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలి



మద్నూర్‌(జుక్కల్‌) : విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని ట్రాన్స్‌కో డీఈ గంగాధర్‌ పేర్కొన్నారు. మండల కేంద్రంలో సోమవారం మూడు నూతన ట్రాన్స్‌ఫార్మర్‌లను ఆయన ప్రారంభించారు. ఈ ప్రాంతంలో అధిక లోడ్‌ ఉండడంతో వోల్టేజ్‌ సమస్య వస్తుండడం, వేసవికాలంలో విద్యుత్‌ వినియోగం ఎక్కువగా అవసరం ఉండడంతో అదనంగా ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేశామన్నారు. ట్రాన్స్‌కో ఏడీఈ సంజీవన్‌రావ్‌, ఏఈ గోపికృష్ణ, సిబ్బంది స్వామి ఉన్నారు.

ఆకట్టుకున్న కుస్తీపోటీలు



బాన్సువాడ రూరల్‌: మండలంలోని కొల్లూర్‌ గ్రామంలో సోమవారం నిర్వహించిన కుస్తీపోటీలు ఆకట్టుకున్నాయి. వివిధ గ్రామాల నుంచి వచ్చిన మల్లయోధులు తమ ప్రతిభను చాటి బహుమతులు అందుకున్నారు. గ్రామంలో ప్రతి ఏటా పాడిపంట, ప్రజలు బాగుండాలని జాతర మహోత్సవం నిర్వహిస్తామని గ్రామకమిటీ అధ్యక్షులు పరిగె బాపురెడ్డి తెలిపారు. ఈసందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు భద్రత ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు సంజీవ్‌రెడ్డి, సాయిలు, పర్వయ్య, దుర్గారెడ్డి, శ్రీనివాస్‌, వీరేందర్‌, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

లొంకలో ఏసీపీ పూజలు



సిరికొండ: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ప్రముఖ శైవ పుణ్యక్షేత్రం లొంక రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని నిజామాబాద్‌ ఏసీపీ రాజావెంకటరెడ్డి సోమవారం సందర్శించారు. సిరికొండ మండల కేంద్రంలో ఉన్న ఈ ఆలయంలో ఏసీపీ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. గర్భాలయంలో పూజలు, శివలింగానికి రుద్రాభిషేకం చేపట్టారు. పురోహితులు నాగరాజు వారికి ఆశీర్వాదాలు అందించి తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏసీపీ దంపతులను సన్మానించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. ఆలయం దట్టమైన అడవుల్లో ఎంతో మనోహరంగా ఉందన్నారు. ఎస్సై ఎల్‌ రామ్‌, ఆలయ కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ, రాజ్‌కుమార్‌రెడ్డి, మారుతి తదితరులు పాల్గొన్నారు.